TGTEL/25/A4812

వాయిస్ ఆఫ్
# వందే భారత్
Voice of Vande Bharath
తెలుగు దినపత్రిక

సంపుటి : 01| సంచిక : 42 | పేజీలు : 04| వెల: రూ.3/- | తెలంగాణ | శుక్రవారం | మే 22, 2026

## ఫ్యూచర్ సిటీ పేరుతో రియల్ వ్యాపారం



- మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు
- బీఆర్ఎస్ అధికారంలోకి రాగానే ప్రాజెక్టు రద్దు..
- ఫార్మా సిటీని పునరుద్ధరిస్తాం

**హైదరాబాద్, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** రాష్ట్రంలో బీఆర్ఎస్ అధికారంలోకి రాగానే కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న 'ఫ్యూచర్ సిటీ' ప్రాజెక్టును రద్దు చేస్తామని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు స్పష్టం చేశారు. ప్రస్తుతం అమెరికా పర్యటనలో ఉన్న ఆయన, రేవంత్ రెడ్డి సర్కార్ అత్యంత ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న ఫ్యూచర్ సిటీపై కీలక వ్యాఖ్యలు చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రతిపాదించిన ఫార్మా సిటీకి మాత్రమే కేంద్ర పర్యావరణ శాఖ నుంచి అన్ని అనుమతులు వచ్చాయని ఈ సందర్భంగా ఆయన గుర్తుచేశారు. భూసేకరణ చేసిన ఉద్దేశాన్ని పక్కనపెట్టి నిబంధనలు ఉల్లంఘిస్తే చట్ట ప్రకారం రైతుల భూములను తిరిగి వారికే అప్పగించాల్సి ఉంటుందని హరీశ్‌రావు పేర్కొన్నారు. ఒకవైపు కోర్టులోనేమో ఫార్మా సిటీని కొనసాగిస్తామని చెబుతూనే.. మరోవైపు రేవంత్ ప్రభుత్వం జిమ్మిక్కులు చేస్తోందని మండిపడ్డారు. నిబంధనల ప్రకారం.. సేకరించిన భూమిలో 75 శాతం మేర ఫార్మా పరిశ్రమలు ఉండి, మిగిలిన 25 శాతంలో దానికి అనుబంధంగా ఎడ్యుకేషన్, హౌసింగ్ వంటి కనీస సౌకర్యాలు కల్పించాల్సి ఉంటుందని వివరించారు. కానీ ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం అందుకు విరుద్ధంగా 75 శాతం ఇతర వ్యాపారాలు చేస్తూ.. కేవలం 25 శాతానికే ఫార్మాను పరిమితం చేసేలా కుట్ర చేస్తోందని, ఇది చట్ట ప్రకారం ఎంతమాత్రం చెల్లదని ఆయన విమర్శించారు. ఫ్యూచర్ సిటీ పేరుతో కాంగ్రెస్ నాయకులు రియల్ ఎస్టేట్ వ్యాపారానికి తెరలేపారని హరీశ్‌రావు ఆరోపించారు.

(మిగతా వివరాలు రెండో పేజీలో..)



2లో..

## భూదోపిడీపై ఉన్న శ్రద్ధ.. రైతన్నలపై ఏదీ?

- సీఎం రేవంత్‌పై కేటీఆర్ మండిపాటు
- ధాన్యం కొనుగోళ్లు లేక రైతులు ప్రాణాలు కోల్పోతుంటే ప్రభుత్వానికి పట్టదా?
- 80 శాతం వడ్లు కొన్నామని నిరూపిస్తే ఏ శిక్షకైనా సిద్ధం..
- సీఎంకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఛాలెంజ్

## వివాదంగా 'త్రిభాషా విధానం'

### సుప్రీంకోర్టులో పిల్ దాఖలు



**న్యూఢిల్లీ, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (సీబీఎస్ఈ) తొమ్మిదో తరగతి విద్యార్థులకు మూడు భాషల బోధనను తప్పనిసరి చేస్తూ తీసుకువచ్చిన నూతన నిబంధన ఇప్పుడు తీవ్ర న్యాయ వివాదానికి దారితీసింది. బోర్డు తీసుకున్న ఈ నిర్ణయాన్ని సవాలు చేస్తూ సుప్రీంకోర్టులో ఒక ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలైంది. విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల తరపున దాఖలైన ఈ పిటిషన్‌ను అత్యున్నత న్యాయస్థానం విచారణకు స్వీకరించింది. ఈ వ్యవహారాన్ని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం ముందు సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గి ప్రస్తావించారు. విద్యా సంవత్సరం మధ్యలో అకస్మాత్తుగా తొమ్మిదో తరగతి నుంచి మూడు భాషలను తప్పనిసరి చేయడం వల్ల విద్యార్థులపై తీవ్రమైన మానసిక, విద్యాపరమైన భారం పడుతుందని రోహత్గి కోర్టుకు వివరించారు. ప్రస్తుతం అమల్లో ఉన్న విద్యా విధానానికి ఇది పూర్తిగా భిన్నంగా ఉందని, దీనివల్ల అటు విద్యార్థుల్లో, ఇటు విద్యాసంస్థల్లో తీవ్ర గందరగోళం నెలకొందని ఆయన పేర్కొన్నారు. ఈ పిటిషన్‌పై త్వరితగతిన విచారణ జరపాలని ఆయన ధర్మాసనాన్ని అభ్యర్థించారు. ఈ విచారణ ఫలితంపై ప్రస్తుతం దేశవ్యాప్తంగా ఉన్న సీబీఎస్ఈ పాఠశాలలు, విద్యార్థులు, తల్లిదండ్రుల్లో తీవ్ర ఉత్కంఠ నెలకొంది.

## గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు ఊతమివ్వాలి

- గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు ఊతమివ్వాలి
- మంత్రి తుమ్మల నాగేశ్వరరావు
- వ్యవసాయాధార, ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలకు రుణాలు పెంచాలి
- సంప్రదాయ పంట రుణాలకే బ్యాంకర్లు పరిమితం కాకూడదు

**హైదరాబాద్, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** తెలంగాణ రాష్ట్ర గ్రామీణ ఆర్థిక వ్యవస్థను మరింత బలోపేతం చేయడంలో బ్యాంకులు చురుకైన భాగస్వాములు కావాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. హైదరాబాద్‌లోని ప్రజా భవన్‌లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల కమిటీ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. బ్యాంకర్లు కేవలం సాంప్రదాయ పంట రుణాలకే పరిమితం కాకుండా, గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనతో పాటు ఫుడ్ ప్రాసెసింగ్




రంగానికి రుణాల పంపిణీని భారీగా పెంచాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు.

(మిగతా వివరాలు రెండో పేజీలో..)

- ముఖ్య అతిథిగా హాజరుకానున్న కేటీఆర్
- కార్యక్రమ బ్రోచర్‌ను ఆవిష్కరించిన జగదీశ్ రెడ్డి




2లో..

## మలేషియాలో జూన్ 6న తెలంగాణ ఆవిర్భావ వేడుకలు

వాయిస్ ఆఫ్ Voice of Vande Bharath
వందే భారత్
VOICE OF
VANDE BHARATH
శుక్రవారం, మే 22, 2026

## ఫ్యూచర్ సిటీ పేరుతో రియల్ వ్యాపారం

- మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు
- బీఆర్ఎస్ అధికారంలోకి రాగానే ప్రాజెక్టు రద్దు..
- ఫార్మా సిటీని పునరుద్ధరిస్తాం

**(మొదటి పేజీ తర్వాత...)** తాము అధికారంలోకి రాగానే ఈ ఫ్యూచర్ సిటీని రద్దు చేసి, యథావిధిగా ఫార్మా సిటీని రీస్టోర్ (పునరుద్ధరణ) చేస్తామని ప్రకటించారు. “ఇది నా సొంత మాట కాదు.. పార్లమెంట్ చట్టం చెబుతున్న సత్యం. తెలంగాణ నుంచి ఒక్క ఫార్మా కంపెనీ కూడా బయటకు వెళ్లకూడదనే ఉద్దేశంతో, లక్షలాది మంది నిరుద్యోగులకు ఉపాధి దొరుకుతుందనే ఆశతో మేము ఫార్మా సిటీని ప్రారంభించాం. ఫార్మా సిటీ గనుక అభివృద్ధి చెందితే బీఆర్ఎస్ ప్రభుత్వానికి ఎక్కడ మంచి పేరు వస్తుందోననే ఈర్ష్యతోనే కాంగ్రెస్ దీనిని అటకెక్కించింది” అని ఆయన ధ్వజమెత్తారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఇప్పటికే రెండున్నరేళ్లు గడిచిపోయిందని, చివరి ఏడాది అంతా ఎన్నికల హడావుడే ఉంటుందని, ఈ తక్కువ కాలంలో రేవంత్ సర్కార్ సాధించింది ఏమీ లేదని హరీశ్‌రావు ఎద్దేవా చేశారు. క్షేత్రస్థాయిలో భూములు పంచిపెట్టి.. బ్యాక్ ఎండ్ లబ్ధి పొందడానికే కాంగ్రెస్ పెద్దలు ఈ ప్లాన్ వేశారని ఆరోపించారు. వారు ఎన్ని కుయుక్తులు పన్నినా.. చివరకు అక్కడ ఫార్మా సిటీనే వస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

## భానుడి భగభగలు..

### వడదెబ్బతో భూపాలపల్లిలో నలుగురు మృతి

**వరంగల్, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** రోహిణీ కార్తె ప్రవేశానికి ముందే భానుడు తన ప్రతాపాన్ని చూపిస్తుండటంతో ముఖ్యంగా ఉమ్మడి వరంగల్ జిల్లా నిప్పుల కొలిమిలా మారింది. ఎండల తీవ్రతకు జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో వడదెబ్బ తగిలి ఒక్కరోజే నలుగురు వ్యక్తులు మృతి చెందడం స్థానికంగా తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. జిల్లాలోని వేర్వేరు మండలాల్లో వడదెబ్బ బారినపడి నలుగురు విగతజీవులయ్యారు. మృతులలో రేగొండ మండలం భాగీరథిపేటకు చెందిన యాకూబ్ (45), మొగుళ్లపల్లి మండలం పోతుగల్లుకు చెందిన సక్కమ్మ (59), చిట్యాల మండలం చల్లగరిగెకు చెందిన పోషయ్య, కాటారం మండలం శంకరంపల్లికి చెందిన సమ్మక్క (65) ఉన్నారు. వీరంతా ఎండ తీవ్రతకు తట్టుకోలేక వడదెబ్బతో ప్రాణాలు కోల్పోయారని స్థానికులు, బంధువులు తెలిపారు.

## భూదోపిడీపై ఉన్న శ్రద్ధ.. రైతన్నలపై ఏదీ ?

- సీఎం రేవంత్‌పై కేటీఆర్ మండిపాటు
- ధాన్యం కొనుగోళ్లు లేక రైతులు ప్రాణాలు కోల్పోతుంటే ప్రభుత్వానికి పట్టదా?
- 80 శాతం వడ్లు కొన్నామని నిరూపిస్తే ఏ శిక్షకైనా సిద్ధం..
- సీఎంకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఛాలెంజ్




**హైదరాబాద్, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** కాంగ్రెస్ ప్రభుత్వానికి భూముల దోపిడీపై ఉన్న శ్రద్ధ, దేశానికి అన్నంపెట్టే రైతులపై లేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం ఆయన హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పెద్దల అండదండలతో వేల కోట్ల విలువైన భూముల ఆక్రమణలు సాగుతున్నా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కనీసం స్పందించడం లేదని విమర్శించారు.

### వేల కోట్ల భూదోపిడీ నిజం కాదా?:

రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్ రెడ్డి ‘భూ హారతి’ పేరుతో కేసముద్రంలో అసైన్డ్ పట్టా భూములను ఆక్రమించారని కేటీఆర్ ఆరోపించారు. అలాగే శంషాబాద్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రధాన అనుచరులు ఏకంగా 90 ఎకరాల సీలింగ్ భూమిని తహసీల్దార్, కలెక్టర్ స్థాయిలో అక్రమ ఉత్తర్వులు సృష్టించి వేల కోట్ల రూపాయల భూదోపిడీకి పాల్పడ్డారని, ఈ వ్యవహారం ఏసీబీ దాడుల్లో రెడ్ హ్యాండెడ్‌గా దొరికిందని గుర్తుచేశారు. ఇంత పెద్ద ఎత్తున అవినీతి జరుగుతున్నా సీఎం రేవంత్ రెడ్డి ఆ వైపు దృష్టి పెట్టడం లేదని మండిపడ్డారు.

### ధాన్యం కుప్పలపైనే రైతుల మరణాలు:

రాష్ట్రంలో ధాన్యం కొనుగోళ్లు సకాలంలో చేపట్టకపోవడం వల్ల అన్నదాతలు కొనుగోలు కేంద్రాల్లోనే పిట్టల్లా రాలిపోతున్నారని కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. ధాన్యం కొనుగోళ్లపై సీఎం రేవంత్ రెడ్డి గురువారం నిర్వహించిన సమీక్షా సమావేశం రైతాంగాన్ని తీవ్ర నిరాశకు గురిచేసిందన్నారు. ప్రభుత్వానికి డబ్బు సంచులపై ఉన్న శ్రద్ధ, ధాన్యం సంచుల (గన్నీ బ్యాగుల) సేకరణపై లేదని ఎద్దేవా చేశారు. తెలంగాణవ్యాప్తంగా వడ్లు కొనక గత 45 రోజుల్లో 10 మంది రైతులు చనిపోతే, ఒక్కరు కూడా చనిపోలేదని పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అబద్ధాలు ఆడుతున్నారని ధ్వజమెత్తారు. మంత్రి సొంత జిల్లాలోనే మహ్మద్ నసీరుద్దీన్ అనే రైతు తాను పండించిన ధాన్యం రాశిపైనే గుండెపగిలి మృతి చెందాడని గుర్తుచేశారు. జనగామ జిల్లా ఏనెబావిలో ఐకేపీ కేంద్రాల్లో కాంటాలు పెట్టడం లేదని స్వయంగా కాంగ్రెస్ కార్యకర్తలే ఆందోళనలకు దిగడం రాష్ట్రంలో నెలకొన్న దుస్థితికి అద్దం పడుతోందన్నారు.

### 80 శాతం కొనుగోళ్లు అబద్ధం - ఏ ఊరికైనా వస్తా:

రాష్ట్రంలో ఇప్పటివరకు కనీసం 35 శాతం ధాన్యం కూడా కొనుగోలు చేయలేదని, కానీ రేవంత్ రెడ్డి మరియు ఆయన మంత్రులు మాత్రం 80 శాతం కొనుగోళ్లు పూర్తి చేశామని పచ్చి అబద్ధాలు చెప్తున్నారని కేటీఆర్ మండిపడ్డారు. రైతుల కష్టాలపై కనీస అవగాహన లేకుండా సీఎం అడ్డగోలుగా మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. “రాష్ట్రంలో ఏ ఊరికైనా పోదాం.. ఎక్కడైనా మీరు చెప్పినట్లు 80 శాతం పంట కొనుగోళ్లు జరిగాయని నిరూపిస్తే మేము ఏ శిక్షకైనా సిద్ధం” అని రేవంత్ రెడ్డికి కేటీఆర్ బహిరంగ సవాల్ విసిరారు. సీఎం రేవంత్ రెడ్డి లాగా అగౌరవంగా, ఇష్టారాజ్యంగా మాట్లాడే భాష తనకు రాదని కేటీఆర్ స్పష్టం చేశారు.

## గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు ఊతమివ్వాలి

- మంత్రి తుమ్మల నాగేశ్వరరావు
- వ్యవసాయాధార, ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలకు రుణాలు పెంచాలి
- సంప్రదాయ పంట రుణాలకే బ్యాంకర్లు పరిమితం కాకూడదు
- రాష్ట్రంలో రికార్డు స్థాయిలో 130.78 శాతానికి చేరిన సీడీ రేషియో

**(మొదటి పేజీ తర్వాత...)** గ్రామీణ తెలంగాణలో పెట్టుబడులు పెట్టడానికి ఇదే సరైన సమయమని, ఈ అవకాశాన్ని బ్యాంకులు పూర్తిస్థాయిలో ఉపయోగించుకోవాలని ఆయన ఆకాంక్షించారు. తెలంగాణలో క్రెడిట్–డిపాజిట్ (సీడీ) నిష్పత్తి రికార్డు స్థాయిలో 130.78 శాతం నమోదు కావడం గొప్ప విశేషమని మంత్రి కొనియాడారు. ప్రస్తుతం రాష్ట్రంలో బ్యాంక్ డిపాజిట్లు రూ. 9.43 లక్షల కోట్లుగా ఉంటే, అడ్వాన్సులు (రుణాలు) రూ. 12.33 లక్షల కోట్లకు చేరాయని వివరించారు. వ్యవసాయ రంగానికి రుణాల పంపిణీలో రాష్ట్రం అద్భుతమైన ప్రగతిని సాధించిందని, వార్షిక రుణ ప్రణాళిక లక్ష్యం కంటే ఎక్కువగా 102 శాతం ప్రగతిని నమోదు చేయడం హర్షణీయమన్నారు. రాష్ట్రంలో పంట రుణాల పంపిణీ రూ. 75,486 కోట్లకు చేరిందని, వ్యవసాయ రంగానికి మొత్తంగా రూ. 1.68 లక్షల కోట్ల రుణాలను బ్యాంకులు అందజేశాయని గణాంకాలను వెల్లడించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రైతు రుణమాఫీ కార్యక్రమం వల్ల గ్రామీణ ప్రాంతాల్లో రుణ సంస్కృతి తిరిగి పునరుద్ధరించబడిందని మంత్రి తుమ్మల పేర్కొన్నారు. ప్రభుత్వ సానుకూల నిర్ణయాల వల్ల బ్యాంకులలో వ్యవసాయ నిరర్థక ఆస్తులు (ఎన్‌పీఏలు) 5.23 శాతం నుంచి 4.71 శాతానికి తగ్గాయని స్పష్టం చేశారు. తెలంగాణలో ఉద్యానవన రంగంతో పాటు ఆయిల్ పామ్ సాగుకు అపారమైన అవకాశాలు ఉన్నాయని, ఈ రంగాలకు బ్యాంకులు పెద్దపీట వేయాలని మంత్రి సూచించారు. పంట నిల్వ సామర్థ్యాన్ని పెంచేందుకు వీలుగా గిడ్డంగులు, కోల్డ్ స్టోరేజీలు, సైలోల నిర్మాణానికి బ్యాంకులు ఉదారంగా రుణాలు ఇవ్వాలని కోరారు. అలాగే రాష్ట్రంలో ఉన్న దాదాపు వెయ్యి రైతు ఉత్పత్తిదారుల సంఘాలకు తగిన ఆర్థిక మద్దతు అందించాల్సిన బాధ్యత బ్యాంకర్లపై ఉందన్నారు. వ్యవసాయాన్ని ఆధునికీకరించేందుకు, యాంత్రీకరణను ప్రోత్సహించేందుకు గానూ ప్రభుత్వం ఈసారి రూ. 147.91 కోట్ల బడ్జెట్‌ను కేటాయించిందని మంత్రి తెలిపారు. కౌలు రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సకాలంలో పంట రుణాలు అందేలా బ్యాంకులు ప్రత్యేక బాధ్యత తీసుకోవాలని ఆదేశించారు. వీటితో పాటు పర్యావరణ హితమైన సోలార్ వ్యవసాయం, మైక్రో ఇరిగేషన్ పద్ధతులకు రుణ సదుపాయాన్ని గణనీయంగా పెంచాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు బ్యాంకర్లను కోరారు.

## మలేషియాలో జూన్ 6న తెలంగాణ ఆవిర్భావ వేడుకలు

- ముఖ్య అతిథిగా హాజరుకానున్న కేటీఆర్
- కార్యక్రమ బ్రోచర్‌ను ఆవిష్కరించిన జగదీశ్ రెడ్డి




**హైదరాబాద్, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** మలేషియా తెలంగాణ అసోసియేషన్, బీఆర్ఎస్ మలేషియా విభాగం సంయుక్త ఆధ్వర్యంలో జూన్ 6న కౌలాలంపూర్‌లో ఘనంగా నిర్వహించనున్న తెలంగాణ ఆవిర్భావ వేడుకల్లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు ముఖ్య అతిథిగా పాల్గొననున్నారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన అధికారిక బ్రోచర్‌ను మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జీ. జగదీశ్ రెడ్డి శుక్రవారం తెలంగాణ భవన్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జగదీశ్ రెడ్డి మాట్లాడుతూ.. భారతదేశంలోనే కాకుండా ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలంగాణ బిడ్డలు కేసీఆర్ పేరును, ఆయన చేసిన అభివృద్ధిని నిరంతరం గుర్తుచేసుకుంటున్నారని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రంలో కేసీఆర్ పాలన లేని లోటు గత రెండున్నరేళ్లుగా స్పష్టంగా కనిపిస్తోందని వెల్లడించారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారంటీలను, హామీలను అమలు చేయలేకపోవడమే కాకుండా.. గతంలో కేసీఆర్ నిరంతరాయంగా అందించిన సంక్షేమ పథకాలను కూడా అటకెక్కించిందని విమర్శించారు. కాంగ్రెస్ మాటలు నమ్మి ఓట్లేసి మోసపోయామని ప్రస్తుతం తెలంగాణ ప్రజలు తీవ్రంగా భావిస్తున్నారని తెలిపారు. గతంలో అమెరికాలోని డల్లాస్ నగరంలో చరిత్రలో ఎన్నడూ లేని రీతిలో తెలంగాణ ఆవిర్భావ వేడుకలు జరిగాయని, అదే స్ఫూర్తితో ఇప్పుడు మలేషియాలో వేడుకలకు ఏర్పాట్లు చేస్తున్నట్లు వివరించారు. దేశంలో బీజేపీ పాలనలో చిన్నపిల్లలకు, మహిళలకు రక్షణ కరువైందని జగదీశ్ రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో మైనర్ బాలికలపై అఘాయిత్యాలు జరుగుతున్నా.. నిందితులను పట్టుకునే కనీస శక్తి, చిత్తశుద్ధి కాంగ్రెస్ ప్రభుత్వానికి లేదని ఆరోపించారు. ప్రపంచవ్యాప్తంగా ఎక్కడ ఏ చిన్న ఘటన జరిగినా ట్వీట్లు చేసే కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ.. తెలంగాణలో జరిగిన మైనర్ బాలిక ఘటనపై ఎందుకు నోరు విప్పడం లేదని, ఎందుకు ట్వీట్ చేయలేదని ప్రశ్నించారు. త్వరలోనే ఖరీఫ్ సీజన్ ప్రారంభం కానున్నా.. రైతులకు సకాలంలో విత్తనాలు, ఎరువులు ఇచ్చే పరిస్థితిలో ఈ ప్రభుత్వం లేదన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన పాత గురువు, చీకటి గురువులు చెప్పినట్లే వింటూ రైతులను వ్యవసాయానికి దూరం చేసేలా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. రైతాంగాన్ని ముంచి, వ్యవసాయ సబ్సిడీలను దోచుకోవాలనే కుట్రలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భాగస్వామ్యమయ్యాయని ఆరోపించారు. ఎల్లవేళలా బీఆర్ఎస్ పార్టీనే తెలంగాణ ప్రజలకు, మహిళలకు శ్రీరామరక్ష అని ఆయన స్పష్టం చేశారు. ఈ బ్రోచర్ ఆవిష్కరణ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి గ్యాదరి బాలమల్లు, బీఆర్ఎస్ ఎన్నారై సెల్ గ్లోబల్ ప్రెసిడెంట్ మహేష్ బిగాల, మైటా ప్రెసిడెంట్ తిరుపతి, ఉమెన్స్ వింగ్ ప్రతినిధి సుప్రియ, బీఆర్ఎస్ మలేషియా ప్రెసిడెంట్ చిట్టిబాబు, శివ, రాష్ట్ర నాయకులు నరసింహారెడ్డి, నంద్యాల దయాకర్ రెడ్డి, ధర్మేందర్ రెడ్డి, పడాల సతీష్, రవియాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# తడిసిన ప్రతి గింజనూ ప్రభుత్వం కొనుగోలు చేయాలి

- మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు డిమాండ్
- అచ్చంపేట మార్కెట్ యార్డును సందర్శించి రైతుల పరామర్శ
- లారీల కొరతతో నిలిచిన రవాణా..
- దళారుల దోపిడీపై ఆగ్రహం



**అచ్చంపేట, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** అకాల వర్షాల వల్ల తీవ్రంగా నష్టపోయిన రైతాంగాన్ని ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని, మార్కెట్ యార్డులో తడిసిన ప్రతి గింజనూ కొనుగోలు చేయాలని అచ్చంపేట మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన అచ్చంపేట వ్యవసాయ మార్కెట్ యార్డును సందర్శించి, అక్కడ పేరుకుపోయిన ధాన్యం కుప్పలను, వర్షానికి తడిసి ముద్దయిన పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా క్షేత్రస్థాయిలో రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ఆయన స్వయంగా అడిగి తెలుసుకున్నారు.

**• స్తంభించిన రవాణా.. అధికారుల నిర్లక్ష్యం:**

అనంతరం గువ్వల బాలరాజు మీడియాతో మాట్లాడుతూ.. మార్కెట్ యార్డులో వందలాది క్వింటాళ్ల ధాన్యం రోజుల తరబడి కొనుగోలు కాకుండా నిలిచిపోవడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కొనుగోలు కేంద్రాల్లో సరైన రవాణా (లారీల) వ్యవస్థ, గన్నీ బ్యాగుల కొరత లేకపోవడం వల్లే ఈ ఘోర పరిస్థితి దాపురించిందని మండిపడ్డారు. అధికారుల ముందస్తు ప్రణాళిక లోపం, నిర్లక్ష్యం వల్లే అకాల వర్షానికి అన్నదాతల కష్టార్జితం నీళ్లపాలవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు.

**• దళారీల చేతుల్లో రైతులు మోసం:**



మరోవైపు మార్కెట్ యార్డుల్లో దళారీలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ రైతులను దగా చేస్తున్నారని, తడిసిన నెపంతో తక్కువ ధరలకే కొనుగోలు చేస్తూ అడ్డగోలుగా దోచుకుంటున్నారని ఆరోపించారు. అన్నదాతలు దళారీల చేతుల్లో మోసపోతుంటే స్థానిక యంత్రాంగం, ప్రభుత్వం ఏం చేస్తోందని నిలదీశారు. రైతులకు మద్దతు ధర దక్కేలా చూడడంలో యంత్రాంగం విఫలమైందన్నారు. మార్కెట్ యార్డులో నిలిచిపోయిన వందలాది క్వింటాళ్ల ధాన్యాన్ని తక్షణమే పూర్తిస్థాయిలో కొనుగోలు చేయాలి. అకాల వర్షానికి తడిసిన, రంగు మారిన ప్రతి గింజనూ నిబంధనలు పక్కనపెట్టి ప్రభుత్వమే మద్దతు ధరకే కొనాలి. ధాన్యం తరలింపునకు అవసరమైన లారీలు, గన్నీ బ్యాగుల వ్యవస్థను యుద్ధప్రాతిపదికన ఏర్పాటు చేయాలి. దళారీల అక్రమ దోపిడీకి తక్షణమే అడ్డుకట్ట వేసి, ఐకేపీ కేంద్రాల్లో రైతులకు పూర్తి భద్రత కల్పించాలి. రైతుల పట్ల ప్రభుత్వం ఇకనైనా నిర్లక్ష్య వైఖరిని వీడకపోతే, అన్నదాతల పక్షాన పెద్ద ఎత్తున ఆందోళనలు, ధర్నాలు చేపడతామని గువ్వల బాలరాజు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధికార ప్రతినిధి సోలంకి శ్రీనివాస్ నాయక్, రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ రేనయ్య, సీనియర్ నాయకులు మంగ నాయుడు, బాలాజీ, జానకి, పట్టణ అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్, శంకర్ మాదిగ, వెంకటేష్, రంగినేని రవీందర్, చందూలాల్, శివచంద్ర గౌడ్, బయ్యా రాజు, మధు, స్థానిక ప్రజాప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌ను కలిసిన ఆత్మ కమిటీ చైర్మన్ ముకుందర్ రెడ్డి



**వేములవాడ, వాయిస్ ఆఫ్ వందే భారత్:** వేములవాడ డివిజన్ అగ్రికల్చర్ టెక్నాలజీ మేనేజ్మెంట్ ఏజెన్సీ (ఆత్మ కమిటీ) నూతన చైర్మన్ ముస్కు ముకుందర్ రెడ్డి, కమిటీ సభ్యులతో కలిసి వేములవాడ నియోజకవర్గ శాసనసభ్యులు, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌ను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన చైర్మన్, సభ్యులు ఎమ్మెల్యేకు శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందించి ఘనంగా సత్కరించారు. ఈ సమావేశంలో భాగంగా వేములవాడ డివిజన్ పరిధిలోని వ్యవసాయ రంగ అభివృద్ధి, రైతులకు అందుతున్న ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం మరియు కమిటీ ద్వారా చేపట్టబోయే భవిష్యత్తు కార్యాచరణపై ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌తో సుదీర్ఘంగా చర్చించారు. నియోజకవర్గంలోని రైతులకు అన్ని వేళలా అందుబాటులో ఉంటూ, వ్యవసాయ రంగాన్ని మరింత బలోపేతం చేసేందుకు ఆత్మ కమిటీ శ్రమించాలని ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ సూచించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు క్షేత్రస్థాయిలో అర్హులైన ప్రతి రైతుకూ చేరేలా కమిటీ బాధ్యతాయుతంగా పనిచేయాలని ఆయన కోరారు. ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ తనపై ఉంచిన నమ్మకంతో అప్పగించిన ఈ బాధ్యతను సమర్థవంతంగా నిర్వహిస్తానని ఆత్మ కమిటీ చైర్మన్ ముస్కు ముకుందర్ రెడ్డి స్పష్టం చేశారు. డివిజన్ పరిధిలోని రైతాంగ సమస్యల పరిష్కారానికి, వ్యవసాయ సాంకేతికతను క్షేత్రస్థాయిలోకి తీసుకెళ్లి రైతులకు చేరువ చేయడానికి నిరంతరం కృషి చేస్తానని హామీ ఇచ్చారు. తమకు ఈ పదవులను కట్టబెట్టినందుకు ఎమ్మెల్యేకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆత్మ కమిటీ సభ్యులు, స్థానిక ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# మద్దిమడుగు అగ్నిప్రమాద బాధితులకు ఆర్థిక సాయం

**పదర, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** మద్దిమడుగు గ్రామంలో ఇటీవల చోటుచేసుకున్న ఘోర అగ్నిప్రమాద బాధితులకు తక్షణ ఆర్థిక సహాయం అందించి ఇప్పలపల్లి గ్రామానికి చెందిన వ్యాపారి సి.వెంకట్రావు తన ఉదారతను చాటుకున్నారు. మద్దిమడుగులో మొన్న రాత్రి జరిగిన ప్రమాదంలో ఐదు దుకాణాలు పూర్తిగా కాలి బూడిదైన సంగతి తెలిసిందే. ఈ ఘటనలో సుమారు పది లక్షల రూపాయల మేర ఆస్తి నష్టం వాటిల్లి, సర్వస్వం కోల్పోయిన బాధితుల పరిస్థితిని తెలుసుకుని ఇప్పలపల్లిలోని 'అయ్యప్ప కిరాణం అండ్ జనరల్ స్టోర్స్' యజమాని సి.వెంకట్రావు తీవ్రంగా చలించిపోయారు. ప్రమాదానికి గురైన వ్యాపారులకు తక్షణ ఆసరా కల్పించాలనే ఉద్దేశంతో ఆయన మద్దిమడుగును సందర్శించి, బాధితులను పరామర్శించారు. తన వంతు సహాయంగా కాలిపోయిన ఐదు షాపుల యజమానులకు ఒక్కొక్కరికి రూ. 5,000 చొప్పున మొత్తం 25 వేల



రూపాయల నగదును ఆర్థిక సహాయంగా అందజేశారు. కష్ట కాలంలో స్పందించి, తోటి వ్యాపారులను ఆదుకోవడానికి ముందుకు వచ్చిన సి.వెంకట్రావు మంచి మనసును మద్దిమడుగు గ్రామస్థులతో పాటు బాధితులు, ఇప్పలపల్లి ప్రజలు ప్రత్యేకంగా అభినందించారు. ప్రభుత్వ రంగం నుంచి కూడా బాధితులకు తగిన నష్టపరిహారం అందించి ఆదుకోవాలని ఈ సందర్భంగా పలువురు కోరారు.

# ఉపాధి కూలీలకు మజ్జిగ ప్యాకెట్ల పంపిణీ



**లింగాల, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** మండల పరిధిలోని పద్మనపల్లి గ్రామంలో జాతీయ ఉపాధి హామీ పథకం పనుల్లో పాల్గొంటున్న కూలీలకు ఎండ తీవ్రత నుండి ఉపశమనం కలిగించేందుకు శుక్రవారం గ్రామ సర్పంచ్ ఎం. శంకర్ ఆధ్వర్యంలో మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేశారు. గ్రామంలో ఉపాధి పనులు చేస్తున్న సుమారు 100 మంది కూలీలకు ఈ సందర్భంగా మజ్జిగ ప్యాకెట్లను అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ శంకర్ మాట్లాడుతూ.. ప్రస్తుతం ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్నందున కూలీలు ఆరోగ్య పరంగా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఉదయాన్నే త్వరగా పనులకు వచ్చి, ఎండ ముదరక ముందే అంటే ఉదయం 10 గంటలకల్లా పనులు ముగించుకుని ఇళ్లకు వెళ్లేలా ప్రణాళిక వేసుకోవాలని కోరారు. గ్రామంలో అర్హులైన కూలీలందరూ ఈ ఉపాధి హామీ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని, ఎక్కువ సంఖ్యలో పనుల్లో పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ మజ్జిగ పంపిణీ కార్యక్రమంలో డిప్యూటీ సర్పంచ్ దేవి వెంకట్రాం, వార్డు మెంబర్ చందు పద్మ, మాజీ సర్పంచ్ దేవి సేవ్యా, స్థానిక నాయకులు రాములు, వెంకటరెడ్డి, పులియా, బాలస్వామి, ఎల్. శంకర్, వాల్యా, లక్ష్మణ్ తదితరులతో పాటు పెద్ద సంఖ్యలో ఉపాధి హామీ కూలీలు పాల్గొన్నారు.

# నిల్వ ఉన్న మక్కలను కొనుగోలు చేయాలి

- తరుగు పేరుతో మోసం చేస్తున్న యంత్రాంగం
- రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎల్.దేశ్ నాయక్

**అచ్చంపేట, వాయిస్ ఆఫ్ వందే భారత్:** అచ్చంపేట వ్యవసాయ మార్కెట్ యార్డుకు మక్కలు తీసుకొచ్చిన రైతుల గోస తీరడం లేదని, మార్కెట్లో రోజుల తరబడి నిలిచిపోయిన ధాన్యపు కుప్పలే ఇందుకు సజీవ సాక్ష్యమని తెలంగాణ రైతు సంఘం నాగర్‌కర్నూల్ జిల్లా అధ్యక్షులు ఎల్. దేశ్ నాయక్ ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం అచ్చంపేట మండల కేంద్రంలోని మార్కెట్ యార్డును రైతు సంఘం నాయకులు క్షేత్రస్థాయిలో సందర్శించారు. అక్కడ నిల్వ ఉన్న మక్కల కుప్పలను పరిశీలించి, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను, పడుతున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మార్కెట్ కార్యదర్శితో మాట్లాడి కొనుగోళ్ల ప్రక్రియపై నిలదీశారు. ఈ సందర్భంగా ఎల్. దేశ్ నాయక్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం మక్కల కొనుగోళ్లపై పైస్థాయిలో చెప్పే మాటలకు, క్షేత్రస్థాయిలో జరుగుతున్న పనులకు పొంతన లేదని మండిపడ్డారు. మార్కెట్లలో అధికారుల తీరు వల్ల రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా తయారైందని ధ్వజమెత్తారు. ఆరుగాలం శ్రమించి, చెమటోడ్చి పండించిన మొక్కజొన్నను మద్దతు ధరకు అమ్ముకుందామని ఆశతో కొనుగోలు కేంద్రాలకు తీసుకొస్తే



అన్నదాతలకు నిరీక్షణే ఎదురవుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కొనుగోలు కేంద్రాల్లో గన్నీ బ్యాగుల సరఫరా లేకపోవడం, హమాలీల కొరత, ధాన్యం తరలింపునకు అవసరమైన లారీలు, ఇతర ట్రాన్స్‌పోర్ట్ వాహనాలను సమకూర్చడంలో ప్రభుత్వం, మార్కెటింగ్ శాఖ పూర్తిగా విఫలమయ్యాయని దేశ్ నాయక్ తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. దీనికి తోడు తరుగు పేరుతో క్వింటాళ్లకు అదనంగా తూకం వేస్తూ రైతులను దగా చేస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి తగినన్ని గన్నీ బ్యాగులు సమకూర్చాలని, పెద్ద మొత్తంలో లారీలను ఏర్పాటు చేసి నిల్వ ఉన్న మక్కలను యుద్ధప్రాతిపదికన కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా సహ కార్యదర్శి వర్ధన్ సైదులు, రైతు సంఘం సీనియర్ నాయకులు బి. రాములు, శివకుమార్, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు శివరాములు, మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు నిర్మల, ప్రజా సంఘాల నాయకులు రాజు, రెడ్యా, మోత్య, శంకర్, రైతులు వెంకటయ్య, నారయ్య, పర్వతాలు తదితరులు పాల్గొన్నారు.

వాయిస్ ఆఫ్ Voice of Vande Bharath
వందే భారత్
VOICE OF VANDE BHARATH
శుక్రవారం, మే 22, 2026

## పదవ తరగతి విద్యార్థులకు 'ప్రతిభ అవార్డులు'

**మాజీ కౌన్సిలర్ అప్పశివ, గాయత్రి వెల్లడి**



**అచ్చంపేట, వాయిస్ ఆఫ్ వందే భారత్:** పదవ తరగతి పరీక్షల్లో అత్యుత్తమ మార్కులు సాధించి ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ప్రోత్సహించేందుకు ఈనెల 23న భారీ స్థాయిలో "ప్రతిభ అవార్డులు" కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు నిర్వాహకులు, మాజీ కౌన్సిలర్ అప్పశివ, గాయత్రి ఒక ప్రకటనలో తెలిపారు. అచ్చంపేట పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో రేపు సాయంత్రం 5 గంటలకు ఈ పురస్కారాల ప్రధానోత్సవ సభ జరగనుంది.విద్యార్థుల్లో మరింత ఉత్సాహాన్ని నింపేందుకు ఈ ఏడాది అవార్డులతో పాటు భారీ నగదు పారితోషికాలను కూడా అందించనున్నట్లు నిర్వాహకులు ప్రకటించారు. ప్రథమ బహుమతిగా రూ.20,000 నగదు, ద్వితీయ బహుమతి: రూ. 10,000 నగదు, తృతీయ బహుమతి రూ.5,000 నగదు అందించనున్నారు. పదవ తరగతి ఫలితాల్లో 400 కంటే ఎక్కువ మార్కులు సాధించిన విద్యార్థులందరూ ఈ అవార్డులకు అర్హులని వారు స్పష్టం చేశారు. స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ ఆశీస్సులతో, అప్ప శివ జ్యువెలర్స్ సౌజన్యంతో ఈ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. గత ఏడాది కూడా ఈ అవార్డుల కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించామని గుర్తుచేశారు. రేపు జరగబోయే ఈ వేడుకకు స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ ముఖ్య నాయకులు హాజరుకానున్నారు. అచ్చంపేట పరిసర ప్రాంతాల విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఈ కార్యక్రమానికి భారీ సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని మాజీ కౌన్సిలర్ అప్పశివ పిలుపునిచ్చారు.

## ప్రకృతి వ్యవసాయంపై అవగాహన సదస్సు

- భూసార పరీక్షలతోనే నాణ్యమైన దిగుబడులు
- కేవీకే ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ వేణుగోపాల్
- రసాయనాలు తగ్గించి కషాయాలు వాడాలి..

**జమ్మికుంట, వాయిస్ ఆఫ్ వందే భారత్:** ప్రకృతి వ్యవసాయంపై రైతుల్లో అవగాహన పెంపొందించే ఉద్దేశంతో మండల పరిధిలోని కనగర్తి గ్రామంలో 'జీవీఎస్ఎస్ కృషి విజ్ఞాన కేంద్రం' ఆధ్వర్యంలో శుక్రవారం ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సదస్సుకు జమ్మికుంట కృషి విజ్ఞాన కేంద్రం ప్రాజెక్టు కోఆర్డినేటర్ వేణుగోపాల్, ప్రతినిధి కుమార్ ముఖ్య అతిథులుగా హాజరై రైతులకు ప్రకృతి సేద్యంపై కీలక సూచనలు చేశారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు కోఆర్డినేటర్ వేణుగోపాల్ మాట్లాడుతూ.. రైతులందరూ తప్పనిసరిగా భూసార పరీక్షలు చేయించుకోవాలని, అప్పుడే నేల స్వభావాన్ని బట్టి సరైన ఎరువులు వాడటం సాధ్యమవుతుందని తెలిపారు. భూమి సారాన్ని, నేల ఆరోగ్యాన్ని పెంపొందించుకోవడానికి నవధాన్యాల సాగు, పచ్చిరొట్ట ఎరువుల వాడకం ఎంతో అవసరమని పేర్కొన్నారు. ఒకే రకమైన పంటలు వేయకుండా.. పంట మార్పిడి విధానాన్ని అవలంబిస్తూ వైవిధ్యమైన పంటలను సాగు చేయాలని రైతులకు పిలుపునిచ్చారు. మరొక వక్త కుమార్ మాట్లాడుతూ.. ప్రజలకు ఆరోగ్యకరమైన, నాణ్యమైన ఆహార పంటలను అందించాల్సిన బాధ్యత రైతులపై ఉందన్నారు. అందుకోసం రసాయన ఎరువులు, మితిమీరిన పురుగుమందుల వాడకాన్ని తగ్గించి, ప్రకృతి సిద్ధమైన కషాయాలను వాడాలని సూచించారు. కషాయాల వాడకం వల్ల సాగు పెట్టుబడి గణనీయంగా తగ్గి, నాణ్యమైన పంట చేతికొస్తుందని వివరించారు. నేల, నీటి కాలుష్యాన్ని నివారించి, పర్యావరణాన్ని పరిరక్షించాలంటే ప్రతి ఒక్కరూ ప్రకృతి వ్యవసాయం వైపు అడుగులు వేయాలని కోరారు. ఈ సందర్భంగా అవగాహనలో భాగంగా రైతుల సమక్షంలో 'పంచగవ్య'ను ప్రత్యక్షంగా తయారు చేసి చూపించారు. ఈ అవగాహన సదస్సులో కనగర్తి గ్రామ సర్పంచ్ రామంచ సంపత్, గ్రామ కార్యదర్శి క్రాంతికుమార్, ఫీల్డ్ ఫెసిలిటేటర్లు ఆకేంద్ర, మమత, రాము, కుమార్, కిరణ్‌లతో పాటు సుమారు 50 మందికి పైగా స్థానిక రైతులు ఆసక్తిగా పాల్గొన్నారు.





## టీపీసీసీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడిగా పండుగ ప్రదీప్

**వేములవాడ, వాయిస్ ఆఫ్ వందే భారత్:** తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) ఎస్సీ సెల్ రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడిగా వేములవాడ అర్బన్ మండలం శభాష్‌పల్లి గ్రామ మాజీ సర్పంచ్, కాంగ్రెస్ పార్టీ యువ నాయకుడు పండుగ ప్రదీప్ నియమితులయ్యారు. ఈ మేరకు టీపీసీసీ ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు, మానకొండూరు శాసనసభ్యులు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ శుక్రవారం అధికారిక నియామక ఉత్తర్వులు జారీ చేశారు. క్షేత్రస్థాయిలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయడానికి, ఎస్సీ సెల్ పరిధిలోని కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేందుకు వీలుగా రాష్ట్రవ్యాప్తంగా వివిధ జిల్లాలకు నూతన అధ్యక్షులను నియమించినట్లు ఈ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. తనకు జిల్లా అధ్యక్షుడిగా అత్యున్నత బాధ్యతలను అప్పగించడం పట్ల పండుగ ప్రదీప్ తీవ్ర హర్షం వ్యక్తం చేశారు. నియామక ఉత్తర్వులు అందుకున్న అనంతరం ఆయన మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో ఈ కీలక బాధ్యతను అప్పగించినందుకు ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అలాగే తన నియామకానికి పూర్తిస్థాయిలో సహకారం అందించిన రాజన్న సిరిసిల్ల జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సంగీతం శ్రీనివాస్, వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌లకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. తన ఎదుగుదలకు తోడ్పడిన జిల్లా, వేములవాడ అర్బన్ మండల కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులకు, ఎల్లప్పుడూ అండగా నిలిచిన కార్యకర్తలకు తాను రుణపడి ఉంటానని పేర్కొన్నారు. పండుగ ప్రదీప్ రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా నియమితులైన వార్త తెలియడంతో వేములవాడ నియోజకవర్గంలో పండుగ వాతావరణం నెలకొంది. నియోజకవర్గ కాంగ్రెస్ శ్రేణులు, వివిధ దళిత సంఘాల నాయకులు, మేధావులు ఆయన నియామకం పట్ల తీవ్ర హర్షం వ్యక్తం చేశారు.



## నడింపల్లిలో విషాదం

- పిడుగుపాటుకు మూడు పాడి ఆవులు మృతి



**అచ్చంపేట, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** అచ్చంపేట మండల పరిధిలోని నడింపల్లి గ్రామంలో గురువారం రాత్రి కురిసిన అకాల వర్షం ఒక రైతు కుటుంబంలో తీవ్ర విషాదాన్ని నింపింది. గ్రామానికి చెందిన శేఖర్ అనే రైతుకు చెందిన వ్యవసాయ పొలంలో పిడుగు పడటంతో మూడు పాడి ఆవులు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాయి. బాధిత రైతు కథనం ప్రకారం.. ప్రతిరోజు లాగే శుక్రవారం ఉదయం ఆవుల నుంచి పాలు పితికేందుకు శేఖర్ తన వ్యవసాయ పొలానికి వెళ్లాడు. అక్కడ ఉన్న మూడు ఆవులు కూడా విగతజీవులుగా పడి ఉండటాన్ని చూసి ఒక్కసారిగా షాక్‌కు గురయ్యాడు. రాత్రి కురిసిన భారీ వర్షానికి తోడు ఒక్కసారిగా పొలంలోని వేప చెట్టుపై పిడుగు పడిందని, ఆ చెట్టు కిందే కట్టేసి ఉన్న ఆవులు ఆ తీవ్రతకు తట్టుకోలేక మృతి చెందాయని గ్రామస్థులు తెలిపారు. జీవనాధారమైన మూడు పాడి ఆవులు ఒకేసారి మృత్యువాత పడటంతో సుమారు 1,50,000 రూపాయల వరకు నష్టం వాటిల్లిందని రైతు శేఖర్ కంటతడి పెట్టుకున్నాడు. ఈ ఘోర ప్రమాదంతో తమ కుటుంబం రోడ్డున పడిందని ఆవేదన వ్యక్తం చేశాడు. ప్రమాదంపై గ్రామస్థులు వెంటనే స్థానిక తహశీల్దార్‌కు సమాచారం అందించారు. దీనిపై తహశీల్దార్ స్పందిస్తూ.. నష్టాన్ని అంచనా వేసేందుకు, ఘటనపై విచారణ జరిపేందుకు రెవెన్యూ అధికారులను పొలానికి పంపిస్తామని హామీ ఇచ్చారు.

## జర్నలిస్ట్ పై దాడిని ఖండిస్తున్నాం

**రేగొండ, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకువచ్చే జర్నలిస్టులపై కొంతమంది రాజకీయ నాయకులు చేస్తున్న దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డీవైఎఫ్ఐ )రాష్ట్ర ఉపాధ్యక్షులు డి.తిరుపతి తెలిపారు.రేగొండ మండలం రూపిరెడ్డి పల్లి గ్రామ ప్రజా సమస్యలపై ప్రశ్నించినందుకు జర్నలిస్టుపై రాజకీయ నాయకుడు భౌతికదాడులకు పాల్పడడం సిగ్గుమాలిన చర్య అని మండిపడ్డారు. జర్నలిస్ట్ పై దాడి చేసిన వారిని అరెస్టు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డీవైఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు తిరుపతి డిమాండ్ చేశారు.

## అన్ని వర్గాల సంక్షేమమే ప్రజా ప్రభుత్వ ధ్యేయం

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్
- తెలంగాణ సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శం..
- పొరుగు రాష్ట్రాలూ అనుసరిస్తున్నాయి

**సిరిసిల్ల, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయంగా ముందుకు సాగుతోందని రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన "ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక" జిల్లా స్థాయి సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ గరిమ అగర్వాల్, జిల్లా ఎస్పీ మహేష్ బి. గీతే, జిల్లా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర సంక్షేమ పథకాలు దేశంలోని ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తున్నాయని చెప్పారు. దానికి నిదర్శనమే ఇటీవల పొరుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు ప్రమాణ స్వీకారం చేస్తూ మన పథకాల స్ఫూర్తితోనే మొదటి సంతకాలు చేయడమని గుర్తుచేశారు. తమిళనాడు ముఖ్యమంత్రి 200 యూనిట్ల ఉచిత విద్యుత్ ఫైల్ పైన, కేరళ ముఖ్యమంత్రి మన రాష్ట్రంలో విజయవంతంగా నడుస్తున్న మహిళల ఉచిత బస్సు ప్రయాణ పథకం ఫైల్ పైన మొదటి సంతకం చేసి అక్కడ ప్రారంభించారని వివరించారు. మన రాష్ట్రం కులగణన చేపట్టి దేశంలోనే అగ్రగామిగా నిలిచిందని, పేదలకు రూ. 5 లక్షల బీమా పథకాన్ని అందిస్తున్నామని పేర్కొన్నారు. రాబోయే 99 రోజుల ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో ప్రజలందరినీ భాగస్వామ్యం చేయడమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు. రాజన్న సిరిసిల్ల జిల్లా ధార్మిక, కార్మిక క్షేత్రమని కొనియాడిన ఆయన, గత ప్రభుత్వం నేతన్నలకు పెట్టిన కోట్లాది రూపాయల బకాయిలను తమ ప్రజా ప్రభుత్వమే చెల్లించి ఆదుకుందని తెలిపారు. దక్షిణ కాశీగా పేరొందిన వేములవాడ రాజన్న ఆలయాన్ని రూ. 150 కోట్లతో అద్భుతంగా అభివృద్ధి చేస్తున్నామని, మరో వెయ్యి సంవత్సరాల పాటు నిలిచేలా ఆలయ పునర్నిర్మాణం చేపట్టడం తన పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నానని ఆనందం వ్యక్తం చేశారు. నియోజకవర్గ పరిధిలో విద్యుత్ సమస్యలు లేకుండా రూ. 10 కోట్లతో నూతన సబ్‌స్టేషన్లను ఏర్పాటు చేస్తున్నామని, రైతులకు నాణ్యమైన విద్యుత్ అందిస్తూ, ఎన్పీడీసీఎల్ ద్వారా సులభంగా మీటర్లు అందజేస్తున్నామని తెలిపారు.